RNI NO: TEL/TEL/2009/28544

సంపుటి : 18
సంచిక : 138
Vol : 18
Issue : 138

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 26 జూలై 2026
Warangal, Sunday 26 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్

Cell : 9493019044
9618509859

# సర్కారు విద్యకు జై..!




## నెరవేరుతున్న ప్రభుత్వ లక్ష్యం

- ఈ ఏడాది కొత్తగా చేరిన లక్షకుపైగా విద్యార్థులు
- సర్కార్ బడులపై పెరుగుతున్న భరోసా
- పూర్వవైభవం దిశగా అడుగులు...
- ఇంగ్లీష్ మీడియం బోధన, సౌకర్యాల కల్పనతో మార్పు
- ప్రైవేటు స్కూళ్ల ఫీజుల భారం కారణమే

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలోని సర్కారు బడులపై తల్లిదండ్రుల నమ్మకం క్రమంగా బలపడుతోంది. ప్రైవేట్ స్కూళ్లపై ఉన్న భ్రమలను వీడుతున్న సామాన్య, మధ్యతరగతి వర్గాలు ప్రభుత్వ చదువుల వైపు అడుగులు వేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఏకంగా లక్ష మందికి పైగా విద్యార్థులు సర్కారు బడుల్లో చేరడం గమనార్హం. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల భారం విపరీతంగా పెరగడంతోపాటు, ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగుపడడం, ఇంగ్లీష్ మీడియం బోధన, ఏఐ, డిజిటల్ పాఠాలు అందుబాటులోకి రావడం, టీచర్ల బోధన పట్ల విశ్వాసం పెరగడమే ఈ సానుకూల మార్పునకు ప్రధాన కారణమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలతో ప్రభుత్వ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించేందుకు పేరెంట్స్ ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్ల నుంచి సర్కారు బడులకు మారిన విద్యార్థుల సంఖ్య శుక్రవారం నాటికి 1,00,174కి చేరుకుంది. అంటే సరిగ్గా లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల వైపు మళ్లారు. దీనికి భిన్నంగా (మిగతా 2వ పేజీలో...)



# నెగ్గిన కాక్రోచ్ పంతం!

## ధర్మేంద్ర రాజీనామా

## 12 ఏండ్ల మోదీ పాలనలో ఫస్ట్ టైం

### ఫలించిన కాక్రోచ్ పార్టీ పోరాటం

- చరిత్ర సృష్టించిన యువత ఆక్రోశం
- జంతర్‌మంతర్‌లో మిన్నంటిన సంబరాలు
- నీట్ సూసైడ్ మృతులకు నివాళి..!
- సుమారు నెలరోజులుగా కొనసాగిన ఆందోళనలు

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : యువత ఆక్రోశానికి కేంద్రం దిగివచ్చింది. జెన్ జీ దెబ్బకి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ పరీక్షా పత్రాల లీకేజీ కుంభకోణం, దేశవ్యాప్తంగా రేగిన విద్యార్థుల నిరసన జ్వాలల నేపథ్యంలో కేంద్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గత కొద్ది రోజులుగా దేశరాజధానితో పాటు అన్ని రాష్ట్రాల్లో ఉధృతంగా సాగుతున్న ఆందోళనల తీవ్రతకు కేంద్రం దిగిరాక తప్పలేదు.

నీట్ లీకేజ్ వివాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పంపుతూ.. గందరగోళంలో ఉన్న కోట్లాది మంది విద్యార్థులు, యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే 12 ఏళ్ల మోదీ ప్రభుత్వంలో తొలిసారిగా ఒక భారీ నిరసన ద్వారా ఒక కేంద్రమంత్రి రాజీనామా చేయడం ఎన్డీఏ చరిత్రలోనే తొలిసారి జరిగిన కీలక పరిణామం.

(మిగతా 2లో...)

# స్మశానంలో దారికాచిన మృత్యువు 2లో

- కాలువలో విరిగిన విద్యుత్ స్తంభం..
- ఏడాది కాలంగా అదే స్థితిలో..
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు!

# మన్యంలో మన్మథులు



- పార్టీ నీడలో పాపిష్టి పనులు
- అవసరాల కోసం వచ్చిన ఆడవారిపై కన్ను
- సూక్తులు చెప్పటం.. చిల్లర వేషాలు వేయటం
- పెద్దమనిషి ముసుగులో రసిక రాజా క్రీడలు
- పార్టీ అండగా భూముల కబ్జాల్లో అరంగేట్రం
- డీఎస్ పెండింగ్‌లో సర్వే నం.9లోని సుమారు 10 ఎకరాల భూమి
- గలీజు నేతలపై దృష్టి ఉంచాలి.. లేకుంటే భారీగా ఓటు నష్టం

2వ పేజీలో..

# ఏడాదంతా..

- తెలంగాణపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం..
- పెరగనున్న సాధారణ ఉష్ణోగ్రతలు..
- తలెత్తనున్న తాగునీటి కష్టాలు

## కరువును ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై ఎక్కువగా ఉండనుందని, ఇప్పటికే నెలకొన్న లోటు వర్షపాతం దీనికి అద్దం పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వర్షాకాలమే కాకుండా మరికొన్ని నెలలపాటు దీని ప్రభావం కొనసాగనుందని అంటున్నారు. ఈ మేరకు ఇన్‌కాయిస్, ఐఎండీ–పుణె సంస్థలు ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన నివేదికల్లో పలు కీలక వివరాలను వెల్లడించాయి. సెప్టెంబరుతో వానాకాలం ముగిసినప్పటికీ వచ్చే ఏడాది మార్చి నెల వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఇన్‌కాయిస్ స్పష్టం చేసింది. తాజా అంచనాల ప్రకారం అక్టోబరు, డిసెంబరు మాసాల్లో ఇది మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఎల్‌నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని చెప్పారు. ఫలితంగా విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. (మిగతా 2వ పేజీలో...)




# సరిహద్దుల్లో డ్రోన్‌ల కలకలం

- భారత్-పాక్ బోర్డర్‌లో ఘటన
- సాంబా, కతువా జిల్లాల్లో హై అలర్ట్!

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : భారత్–పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దులో మరోసారి అలజడి మొదలైంది. జమ్మూ–కశ్మీర్ లోని సాంబా, కతువా జిల్లాల్లో సరిహద్దు వెంబడి అనుమానాస్పద డ్రోన్‌ల కదలికలు కలకలం సృష్టించాయి. దీంతో భద్రతా దళాలు అప్రమత్తం అయ్యాయి. రెండు వేర్వేరు ప్రాంతాల్లో డ్రోన్‌లు కనిపించడంతో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (దీూఫ్) సిబ్బంది విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. భద్రతా దళాల అధికారుల సమాచారం ప్రకారం, శుక్రవారం రాత్రి పొద్దుపోయిన (మిగతా 2లో...)



2లో

# ఇది విద్యార్థుల విజయం



- పోరాటానికి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి సంపూర్ణ మద్దతు
- దేశ వ్యాప్తంగా లభించిన సానుభూతి
- విద్యార్థుల గొంతును ఎవ్వరూ అణచివేయలేరు
- భవిష్యత్‌లో ఇదే పోరాట స్ఫూర్తి కొనసాగాలి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

# 'మన్యం'లో మన్మథులు

- పార్టీ నీడలో పాపిష్టి పనులు
- అవసరాల కోసం వచ్చిన ఆడవారిపై కన్ను
- నీతి సూక్తులు చెప్పటం.. చిల్లర వేషాలు వేయటం
- పెద్దమనిషి ముసుగులో రసిక రాజా క్రీడలు
- పార్టీ అండగా భూముల కబ్జాల్లో అరంగేట్రం
- డీఎస్ పెండింగ్‌లో సర్వే నం.9లోని సుమారు 10 ఎకరాల భూమి
- గలీజు నేతలపై దృష్టి ఉంచాలి.. లేకుంటే భారీగా ఓటు నష్టం

**నూగురు వెంకటాపురం-పీపుల్స్ డైరీ :** పార్టీ తోడుగా ఉంటే ఎలాంటి నీచపు పనులు అయినా చేయవచ్చనే కొందరు నేతల ఆలోచనలకు, 'మన్యం'లో నేతలు చేస్తున్న దరిద్రపు గొట్టు పనులే నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. భూకబ్జాలు, అక్రమ వ్యాపారాలు, శ్రమ దోపిడీలు వంటి పనులకు పార్టీలను అడ్డుపెట్టుకునే నేతలు కొందరైతే.. కుటుంబాల్లోని ఆర్థిక అవసరాలకు, వ్యక్తిగత పనులకు కొందరి ఆడవారిని లొంగ తీసుకునే కుట్రలతో బరితెగింపు చర్యలకు పాల్పడటం.. ఏజెన్సీ ప్రాంతంలో కొందరు నేతలు చేస్తున్న నీచాతి నీచమైన పనిగా పేర్కొనవచ్చు.

అవసర నిమిత్తం వచ్చిన ఆడవారిని, రాజకీయాల్లో ప్రవేశం చేయాలనుకునే కొందరిని, అవకాశం ఇవ్వాలంటున్న మరికొందరిని లొంగదీసుకునేందుకు చేయకూడనటువంటి పనులను చేసి పాపాలను మూటగట్టుకుంటున్నారు. వీరు పగటిపూట జనాల మధ్యలో ఉన్నప్పుడు, ఇతరులను పలకరించే తీరు నాన్న.. చిన్న.. కన్న.. బుజ్జి.. తల్లి.. చెల్లి.. అవ్వ.. అయ్యా అంటూ తల నిమరడం.. భుజం తడుతూ బయటకు బుద్ధావతారం ఎత్తుకుంటారు. కానీ లోలోపల మాత్రం వంకర బుద్ధితో నయవంచన చేసుకోవాలన్న ఆలోచనలు నిమగ్నం అవుతుంటారు.

పెద్దమనుషుల వలే ఆదరిస్తున్నట్టు నటిస్తూ, జనాలు ఛీదరించుకునే పనులు చేస్తున్న వారి వినాశనం దారుణంగా ఉంటుందని చరిత్ర పుటలే చెబుతున్నాయి. విచిత్రం ఏమిటంటే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వీరికి అధికారులు ప్రాధాన్యత కల్పించడం.. కొన్ని తరహా పంచాయతీలు చేయటం.. ముఖ్యంగా తప్పుడు కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఇతరులకు హిత బోధించడం మరింత సిగ్గుచేటు అవుతుంది.

"గురువింద గింజ తన తప్పు ఎరగదంట"సామెత 'మన్యం'లో కొందరి నేతల పోకడ తీరును సరిగ్గా వర్ణించ పడుతుంది. వీరి విరహాలకు, సరసాలకు చెట్లు.. తుప్పలు.. రాళ్లు.. రప్పలు.. పంట చేలు వంటి ప్రదేశాలను ఉపయోగించడంతో జనాల కంట్లో పడి వంకర బుద్ధి బయటపడతుందని చెప్పాలి. చుట్టు ప్రక్కల వారితో సంబంధం లేకుండా, పలుకుబడి ఉందనే గర్వంతో రాసలీలలకు రక్తి కట్టిస్తున్న రసిక రాజాల లీలలు ఊరూరా ప్రాకి మారు మ్రోగుతున్నాయని అనడంలో ఆశ్చర్యం లేదు.

**భూ కబ్జాల్లో అరంగేట్రం...**

పేదవారి ఆర్థిక అవసరాలు, వారి దీనస్థితిని ఆసరాగా భావించి కోరికలు తీర్చుకునే ఓ పెద్దమనిషి ప్రభుత్వ భూములను కాజేసేందుకు కుట్రలకు తెరలేపినట్లు తెలుస్తుంది. మండలంలోని మరికల పంచాయతీ సర్వేనెంబర్ 9లో సుమారు 10 ఎకరాల భూమిని అక్రమంగా పట్టా చేయించుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఈ భూమి డిఎస్ పెండింగ్ లో ఉండడం, అందుకు రెవిన్యూ అధికారుల అండదండలు ఉన్నట్లు కూడా విశ్వసనీయ సమాచారం.

పేదల భూములకు నానా రకాల షరతులు విధించే అధికారులకు పెద్దల అక్రమాలకు వంత పాడడం అవినీతిని స్వాగతించడమే అవుతుంది. ఉన్నత స్థాయి అధికారులు జిల్లాలో అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలన్న కొందరి ఫిర్యాదులకు మౌనం వహించటం అక్రమాలకు ఊతమిచ్చినట్లుగా ఉందని విద్యావంతులు సైతం అభిప్రాయపడుతున్నారు.

పార్టీలను అడ్డుపెట్టుకొని చిల్లర వేషాలు, చెత్త పదులు చేసే వారిపై దృష్టి సారించక పోతే, భారీ స్థాయిలో ఓట్లు నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

# నెగ్గిన కాక్రోచ్ పంతం..

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి రాజీనామా పరిణామంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే తక్షణమే స్పందించారు. ఈ రాజీనామా తమ ఉద్యమానికి దక్కిన చారిత్రాత్మక విజయమని ఆయన కొనియాడారు. "మనం సాధించాం.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు! అధికార పక్షాల బెదిరింపులకు భయపడకుండా, లొంగకుండా ఎదురు తిరిగి పోరాడితే ఎంతటి వారైనా దిగిరాక తప్పదని ఈ పరిణామం నిరూపించింది" అని దిప్కే వ్యాఖ్యానించారు.

**జంతర్ మంతర్‌లో మిన్నంటిన సంబరాలు**

**నీట్ మృతులకు నివాళి..!**

నీట్ సహా జాతీయ పోటీ పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం నెల రోజులుగా ఢిల్లీలో ఆందోళనలు నిర్వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ(జజీ), విద్యార్థులు ఎట్టకేలకు తమ పంతం నెరవేర్చుకున్నారు. శనివారం మధ్యాహ్నం కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో మూడో విడత చర్చలకు ముందే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమాచారం అందుకున్న సీజేపీ ప్రతినిధులు జంతర్ మంతర్‌లో విద్యార్థులను ఉద్దేశించి కీలక ప్రకటన చేశారు.

వాస్తవానికి నిన్న రాత్రి ప్రధాని మోడీ ఆధ్వర్యంలో సమావేశమైన కేంద్ర కేబినెట్ .. మంత్రుల రాజీనామాలు అక్కర్లేదంటూ తేల్చేసింది. అనంతరం ప్రధాని మోడీ విద్యార్థులు కేంద్రం చర్యలతో సంతోషంగా ఉన్నారంటూ అర్ధరాత్రి మరో సెల్ఫీ వీడియో విడుదల చేశారు. దీంతో విద్యార్థులు ఇవాళ తమ ఆందోళనల్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటన వెలువడటంతో జంతర్ మంతర్ లో విద్యార్థుల సంబరాలు మిన్నంటాయి. ముందుగా కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే.. తనకు వచ్చిన ఫోన్ కాల్ ను స్టేజ్ మీదే మాట్లాడి ఈ విషయాన్ని మైక్ లో ప్రకటించారు. దీంతో విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు.

ప్రధాన్ రాజీనామా చేసినట్లు తెలియడంతతో సీజేపీ ప్రతినిధులతో కలిసి వారు సంబరాలు చేసుకుంటున్నారు. దీంతో జంతర్ మంతర్ లో ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేనంత స్థాయిలో



వాతావరణం పూర్తిగా మారిపోయింది. విద్యార్థులు భావోద్వేగంతో పరస్పరం హత్తుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ కారణంగా చనిపోయిన విద్యార్థుల చిత్రపటాలున్న పోస్టర్ ను స్టేజ్ మీదకు తీసుకొచ్చిన విద్యార్థులు.. వారికి పేరు పేరునా నివాళులు అర్పించారు.

# స్మశానంలో దారికాచిన మృత్యువు

- కాలువలో విరిగిన విద్యుత్ స్తంభం..
- ఏడాది కాలంగా అదే స్థితిలో...
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు!

**పీపుల్స్‌డైరీ-మునగాల :** సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరింది. గ్రామ స్మశాన వాటిక సమీపంలో, ప్రధాన బీటీ రోడ్డు పక్కనే ఉన్న పెద్ద కాలువలో ఒక ప్రధాన విద్యుత్ స్తంభం కింది భాగం పూర్తిగా విరిగిపోయి, నీటిలోనే గాల్లో వేలాడుతున్నట్లుగా అత్యంత ప్రమాదకర స్థితికి చేరినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**ఏడాదిగా అదే పరిస్థితి**

గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలు, కాలువలో వచ్చిన వరద ధాటికి ఈ సిమెంట్ కరెంట్ స్తంభం అడుగు భాగం పూర్తిగా విరిగిపోయింది. దాదాపు ఒక సంవత్సరం కాలంగా ఈ స్తంభం ఇదే విధంగా కాలువలో విరిగిపోయి ఉన్నప్పటికీ, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు మాత్రం కంటితుడుపుగానైనా అటువైపు చూడకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సపోర్ట్ స్తంభంపైనే భారం**

ప్రస్తుతం ఈ ప్రధాన విద్యుత్ స్తంభానికి కింద భూమితో ఎలాంటి పట్టు లేదు. కాలువలో పడిపోకుండా కేవలం పక్కనే ఉన్న సపోర్ట్ స్తంభం, మరియు పైన ఉన్న హైవోల్టేజ్ కరెంట్ తీగల పట్టు వల్లనే ఇది ఎలాగోలా ఆగి ఉంది. నిత్యం వందలాది వోల్టుల విద్యుత్ ప్రసారమయ్యే ఈ తీగలు ఏమాత్రం తెగినా, ఆ కరెంట్ అంతా కాలువ నీటిలో ప్రవహించి ఊహించని రీతిలో భారీ ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంది.

**భయాందోళనలో రాకపోకలు**

బీటీ రోడ్డుకు ఆనుకుని, స్మశాన వాటికకు వెళ్లే ముఖ్యమైన దారిలోనే ఈ కాలువ, స్తంభం ఉండటంతో నిత్యం ఇటుగా జనం, వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. చుట్టుపక్కల పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు నిత్యం ఈ కాలువ గట్టున నడవాల్సి వస్తోంది. గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం జనం గుంపులుగా వెళ్లాల్సి వస్తుంది. అటువంటి సమయంలో ఈ స్తంభం ఎక్కడ నెత్తిన పడుతుందో, లేదా కాలువలో కరెంట్ షాక్ కొడుతుందోనని ప్రజలు గుండె చేతుల్లో పట్టుకుని తిరుగుతున్నారు. ప్రస్తుతం మళ్లీ వర్షాలు పడుతుండటంతో కాలువలో నీటి ప్రవాహం పెరిగి, ఈ విరిగిన స్తంభం ఏ క్షణంలోనైనా కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



**పెద్ద ప్రమాదం జరక్కముందే స్తంభాన్ని మార్చాలి**

"బీటీ రోడ్డు పక్కనే ఉన్న పెద్ద కాలువలో ఈ స్తంభం విరిగిపోయి ఏడాది అవుతోంది. ఇటుగా మా పొలాలకు వెళ్లాలన్నా, స్మశాన వాటికకు వెళ్లాలన్నా భయమేస్తోంది. కరెంట్ తీగలు బలంగా లాగి పట్టుకోవడం వల్లే ఆ స్తంభం ఆగింది. కాలువలో నీళ్లు ఉన్నప్పుడు అది పడిపోతే చుట్టుపక్కల వాళ్లంతా ప్రాణాలు కోల్పోతారు. అధికారులు ఎవరూ అటువైపు వచ్చి చూడటం లేదు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాక వస్తారా? ఇప్పటికైనా కొత్త స్తంభం వేసి మమ్మల్ని కాపాడాలి."

*తాడ్వాయి గ్రామ రైతులు, స్థానికులు.*

# ఇది విద్యార్థుల విజయం...

- పోరాటానికి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి సంపూర్ణ మద్దతు
- విద్యార్థుల గొంతును ఎవ్వరూ అణచివేయలేరు
- భవిష్యత్‌లో ఇదే పోరాట స్ఫూర్తి కొనసాగాలి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : విద్యార్థుల సంఘటిత పోరాటానికి కేంద్రం దిగివచ్చిందని, అన్ని షరతులకు ఒప్పుకోవడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం అతిపెద్ద విజయమని, ఈ పోరాటానికి రాహుల్‌గాంధీతో పాటు రేవంత్‌రెడ్డి సంపూర్ణ మద్దతు తెలుపడంతో మరింత బలం చేకూరిందని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా వ్యవస్థలో పారదర్శకత, న్యాయం కోసం కొనసాగుతున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తు. విద్యార్థుల గొంతుకను అణచివేయడం కాదు, ఆలకించడం ప్రభుత్వ బాధ్యత" అని అన్నారు.

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. "అభిజిత్, దీపకా... మేమంతా మీకు అండగా ఉన్నాం. మీ పోరాటం ఒంటరిది కాదు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు, యువత, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మీ వెంటే నిలుస్తుంది" అని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తెలిపారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడిన విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, విద్యార్థులను వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

అలాగే దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక "స్టూడెంట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటంతో పేపర్ లీకులు, పరీక్షల్లో అక్రమాలు, నిర్లక్ష్యానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు విధించేలా చట్టం మార్చడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, కేసీఆర్ ప్రస్తుతం విద్యార్థులకు మద్దతు ప్రకటించడం ప్రజలను నమ్మించలేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలు నియామక పరీక్షల పేపర్ లీకులు, పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాల వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, ఆ ఘటనలను తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు.

చివరగా, "భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, సమాజంలోని ప్రతి వర్గం న్యాయం కోసం చేసే పోరాటాలకు అండగా ఉంటుంది. విద్యార్థుల పోరాటం వ్యక్తుల కోసం కాదు, దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటం" అని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు.



# పెండింగ్ కేసుల తగ్గింపే లక్ష్యం

**హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయసేన రెడ్డి**

**సత్వర న్యాయం దిశగా హనుమకొండలో మూడు కొత్త కోర్టులు ప్రారంభం**




**పీపుల్స్‌డైరీ-హనుమకొండ :** ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో హనుమకొండ జిల్లా కోర్టు ఆవరణలో మరో మూడు అదనపు న్యాయస్థానాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో జనాభా పెరుగుదల, పెండింగ్ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ విజయసేన రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ప్రారంభించిన హనుమకొండ జిల్లాలో మూడవ అదనపు జిల్లా కోర్టు, ఐదవ మున్సిఫ్ కోర్టు, ఆరవ మున్సిఫ్ కోర్టు శనివారం నుంచే కార్యకలాపాలు ప్రారంభించాయని పేర్కొన్నారు. అనంతరం వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నూతనంగా పునర్నిర్మించిన భవనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సేవలను, నాల్సా పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.

అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కోర్టు ప్రాంగణంలోని మౌలిక వసతులు, భద్రత సమస్యలను హైకోర్టు న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా పార్కింగ్ సౌకర్యం, సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి సాధ్యమైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని జస్టిస్ విజయసేన రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా యునైటెడ్ వరంగల్ జిల్లా అడ్వకేట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పు కృష్ణారావు, ఉపాధ్యక్షుడు చెన్నూరి రమేష్, ప్రధాన కార్యదర్శి ఏ. కిరణ్ సింగ్ హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం సమర్పించి, సొసైటీ అభివృద్ధికి న్యాయవ్యవస్థ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి. బి. నిర్మల గీతాంబ, యం. ఆర్. సునీత ఇతర న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి. హెచ్. ఉపేందర్, సి. హెచ్. రామకృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎం. సహోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నాగేందర్, నరేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ న్యాయవాదులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సరిహద్దుల్లో డ్రోన్‌ల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత సాంబా జిల్లాలోని విజయ్‌పూర్ ప్రాంతం తరోరే గ్రామం వద్ద ఆకాశంలో ఒక అనుమానాస్పద వస్తువును భద్రతా సిబ్బంది గుర్తించారు. అది పాకిస్తాన్‌కు చెందిన డ్రోన్ అయి ఉండవచ్చని అనుమానించిన అధికారులు వెంటనే డ్రోన్ నిరోధక చర్యలు చేపట్టారు. అయితే ఆ డ్రోన్ అంతర్జాతీయ సరిహద్దును దాటి తిరిగి పాకిస్తాన్ వైపు వెళ్లిపోయినట్లు భావిస్తున్నామని తెలిపారు.

ఇదే సమయంలో కతువా జిల్లాలోని హిరానగర్ సెక్టార్‌లోని చక్ నలువా గ్రామంపై మరో అనుమానాస్పద డ్రోన్ ఎగురుతూ కనిపించినట్లు అధికారులు వెల్లడించారు. బోబియా ప్రాంతంలో కూడా డ్రోన్ కదలికలు గుర్తించినట్లు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లో భద్రతా బలగాలు అప్రమత్తమై తనిఖీలు చేపట్టాయి. డ్రోన్‌ల ద్వారా ఏదైనా ఆయుధాలు, మందుగుండు సామగ్రి లేదా ఇతర అనుమానాస్పద వస్తువులు పడవేశారా అనే కోణంలో భద్రతా దళాలు పరిశీలిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, ఎలాంటి చొరబాట్లు లేదా అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు నిఘా పెంచినట్లు అధికారులు తెలిపారు.

# ఏడాదంతా...

(మొదటి పేజీ తరువాయి)




మరోవైపు సాగు, తాగునీటి లోటు ఏర్పడి పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఇది రైతులను ఆర్థికంగా నష్టపరిచే ప్రమాదం ఉండగా.. రైతు కూలీల ఆదాయం కూడా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ముప్పును ముందస్తుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా సూక్ష్మసేద్యం ద్వారా నీటిని పొదుపు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 2026-27 సంవత్సరంలో 2,38,750 ఎకరాల భూమిలో బిందుసేద్యం ఏర్పాటు చేసేందుకు రూ.498 కోట్లను వెచ్చించేలా సమగ్ర ప్రణాళికను రూపొందించింది. ఉద్యానశాఖ ద్వారా ఇప్పటికే ఆర్థికశాఖకు నిధుల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు.

ఈ రాయితీ పథకం కింద ఆయిల్‌పామ్, కూరగాయలు, మిర్చి, మక్కలు, కంది, పసుపు, సుగంధ ద్రవ్యాలు, ఉద్యాన, గులాబీ, మల్బరీ, మల్లె తోటల సాగుకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందజేస్తారు. ఈ రాయితీలు వర్గాల వారీగా వర్తింపజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం మేర రాయితీని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సర్కారు విద్యకు జై

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటుకు వెళ్లిన విద్యార్థులు కేవలం 10,490 మంది మాత్రమే ఉండడం విశేషం. ప్రైవేట్ నుంచి సర్కారుకు వచ్చే వారి సంఖ్యతో పోలిస్తే.. బయటకు వెళ్లే వారు కేవలం 10 శాతమే ఉండటం ప్రభుత్వ బడులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనమని అధికారులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి సర్కారు బడుల్లో చేరుతున్న వారిలో నిజామాబాద్ జిల్లా ముందు వరుసలో నిలిచింది. ఇక్కడ అత్యధికంగా 8,461 మంది విద్యార్థులు ప్రైవేటును వదిలి ప్రభుత్వ స్కూళ్లలో చేరగా, ఆ తర్వాతి స్థానాల్లో జగిత్యాల 6,010 మంది, రంగారెడ్డి 5,524, కామారెడ్డి 5,284, నల్గొండ 4,919 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర రాజధాని ప్రాంతాలైన హైదరాబాద్ 2,527, మేడ్చల్ మల్కాజిగిరి 3,538 జిల్లాల్లో కూడా గణనీయమైన మార్పు కనిపించింది. అత్యల్పంగా ములుగు జిల్లాలో 566 మంది మాత్రమే సర్కారు బడిబాట పట్టారు. మరోపక్క సర్కారు నుంచి ప్రైవేటు బడుల్లో చేరిన వారిలో ఖమ్మం జిల్లా 868 మందితో టాప్‌లో ఉంది.

ప్రైవేటు బడుల్లో ఆకాశాన్నంటుతున్న ఫీజులు, డొనేషన్ల భారం మధ్యతరగతి, పేద వర్గాలకు శాపంగా మారాయి. అదే సమయంలో ప్రభుత్వ బడుల్లో పెరుగుతున్న మౌలిక వసతులు, ఇంగ్లిష్ మీడియం బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు మధ్యాహ్న భోజనంలాంటి సౌకర్యాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటితో పాటు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, వెల్‌కమ్ కిట్, ఏఐ, డిజిటల్ పాఠాలు పేరెంట్స్ ఆలోచనలను పూర్తిగా ప్రైవేటు నుంచి సర్కారు వైపు మళ్లించాయి. సర్కారు బడుల్లో చదివితేనే పిల్లల విద్యా ఫౌండేషన్ బలంగా ఉంటుందనే అభిప్రాయం బలపడుతోందని ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు మరింత పటిష్టమవుతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

# పోలీసుల విపత్తు నిర్వహణ శిక్షణ ముగింపు

**మామునూర్ 4వ బెటాలియన్‌లో మహబూబాబాద్ పోలీసులకు ట్రైనింగ్**







**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** మామునూర్ 4వ బెటాలియన్‌లో డిజాస్టర్ మేనేజ్మెంట్ లో భాగంగా శనివారం మహబూబాబాద్ జిల్లా ఎఆర్ హెడ్ క్వార్టర్ నుండి మరియు మహబూబాబాద్ సివిల్ పోలీసులు 30 మంది 4 వారాల పాటు బేసిక్ ఫస్ట్ రెస్పాన్స్ (బి.ఎఫ్.ఆర్.సి) కోర్స్ 4వ బెటాలియన్ లో శిక్షణ తీసుకోవడం జరిగింది. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంకి ముఖ్య అతిథిగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి హాజరైనారు. ఈ శిక్షణలో భాగంగా వీరికి ముఖ్యంగా నాలుగు విభాగాల గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. మొదటి విభాగం ఎమ్ఎఫ్ఆర్ (మెడికల్ ఫస్ట్ రెస్పాండర్) గురించి రెండవ విభాగం సిఎస్ఎస్ఆర్ (కాలేప్సెడ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ), మూడవ విభాగం రోప్ రెస్క్యూ,నాలుగవ విభాగం ఎ.డి.ఆర్.సి (ఆక్వాటిక్ డిజాస్టర్ రెస్పాన్స్ కోర్స్ ) గురించి నిష్ణాతులయిన సిబ్బంది చేత శిక్షణ ఇవ్వడం జరిగిందని కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి తెలియజేసారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు కమాండెంట్ అందజేశారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమం లో మహబూబాబాద్ జిల్లా డిఎస్పి శ్రీనివాస్, 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్ ఆర్ఐ లు విజయ్, రవి, సర్వర్,వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్ బెటాలియన్ అధికారులు,ఎస్డిఆర్ఎఫ్ ట్రైనింగ్ సిబ్బంది,శిక్షణార్థులు పాల్గొన్నారు.

# బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడుకు ఎంపీ ఈటల రాజేందర్ ఘన సన్మానం

- బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌కు ఎంపీ ఈటల రాజేందర్ ఘన సన్మానం

**మేడ్చల్ జూలై 25 (పీపుల్స్ డైరీ)** :మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ చేతుల మీదుగా నూతనంగా బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాగం అర్జున్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ శాలువాతో సత్కరించి రాగం అర్జున్‌ను అభినందించారు. యువతలో సేవా భావాన్ని పెంపొందిస్తూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. మేడ్చల్ జిల్లాలో యువతను సమన్వయం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాగం అర్జున్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ మార్గదర్శకత్వంలో పార్టీ సిద్ధాంతాల ప్రచారం, యువత సమస్యల పరిష్కారం, ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీను, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, బీజేపీ, బీజేవైఎం జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాగం అర్జున్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య శక్తుల విజయానికి నిదర్శనం

- విద్యార్థుల ఐక్య పోరాటం చారిత్రక విజయం --
- విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.
- సోతుకు.ప్రవీణ్ కుమార్ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

**భూపాలపల్లి జూలై 25 పీపుల్స్ డైరీ..** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు సాగించిన ఐక్య, ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన గొప్ప విజయమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలపై విద్యార్థులు దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఉద్యమించారని, ఢిల్లీలో జరిగిన నిరసనలను అణచివేయడానికి లాఠీచార్జ్, టియర్ గ్యాస్ వంటి చర్యలకు పాల్పడినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని అన్నారు. చివరకు ప్రజా ఒత్తిడి, విద్యార్థుల ఐక్య ఉద్యమం ఫలితంగానే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే, రాజీనామాతోనే సమస్య ముగిసిపోయిందని భావించకూడదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, చనిపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావాలని, దేశ విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులకు అభినందనలు తెలియజేస్తూ, దేశ విద్యా వ్యవస్థను రక్షించే ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని సోతుకు. ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.



# మోడల్ సోలార్ విలేజ్ పనులు వేగవంతం చేయాలి

- కాటారం మోడల్ సోలార్ విలేజ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

శనివారం ఐడిఓసి కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పి.ఎం. సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన కాటారం మండల కేంద్రంలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటుపై రెడ్ కో, విద్యుత్తు, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. టిజిఎస్పిడిసిఎల్ పరిధిలోని క్లస్టర్-3 కింద కాటారం గ్రామంలో మొత్తం 700 గృహాలకు 1,400 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి 2 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, ఈ ప్రాజెక్టును కేంద్రీయ భండార్, హైదరాబాద్ సంస్థ 180 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. సాంకేతిక ప్రమాణాలు ప్రాజెక్టు నిబంధనలకు అనుగుణంగా మాడ్యూల్ వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రతి మాడ్యూల్‌పై తయారీ వివరాలతో కూడిన ఆర్ ఎఫ్ ఐ డి (=ఖీ×ఐ) ట్యాగింగ్ తప్పనిసరి చేయాలని అన్నారు. గుడిసెలు మరియు ఎత్తైన నిర్మాణాలపై సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. ప్లాంట్ స్థాపన అనంతరం 5 సంవత్సరాల పాటు ఉచిత నిర్వహణ అందించాల్సి ఉందని, సమస్యలు తలెత్తితే 72 గంటల్లో పరిష్కరించాలని తెలిపారు. పనుల పురోగతి రెడ్ కో మరియు టిజిఎన్ పిడిసిఎల్ నివేదికల ప్రకారం కాటారంలో ఇప్పటివరకు 334 గృహాల సర్వే పూర్తి కాగా 110 ఇళ్ల రూఫ్‌టాప్స్ గుర్తించారని, 99 గృహాలకు మెటీరియల్ ఏర్పాటు జరిగినట్లు తెలిపారు. సౌర విద్యుత్ వినియోగం ద్వారా ఉచితంగా విద్యుత్ ఇవ్వడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రెడ్ కో డిఎం రాజేందర్, విద్యుత్ శాఖ ఎస్ ఈ రమేష్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



# రవి నాయక్‌కు కారేపల్లి ప్రముఖుల ఘన నివాళి

- రవి నాయక్ నా సోదరుడితో సమానం" - కంటతడి పెట్టుకున్న సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు
- న్యాయవ్యవస్థకు తీరని లోటు: అజ్మీరా వీరన్న

**సింగరేణి (కారేపల్లి), జూలై 25: (పీపుల్స్ డైరీ):** ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అడ్వకేట్ రవి నాయక్ మృతి న్యాయవృత్తికి, గిరిజన సమాజానికి తీరని లోటని సీనియర్ ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన అడ్వకేట్ రవి నాయక్ దశదిన కార్యక్రమం సందర్భంగా శనివారం కారేపల్లిలో నిర్వహించిన నివాళి సభలో స్థానిక ప్రముఖులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రవి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, "రవి నాయక్ నాకు సోదరుడితో సమానం. చిన్న వయసులో నా వద్ద న్యాయవాదిగా పనిచేసి తన ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదిగాడు. అందరినీ కలుపుకొని వెళ్లే మంచి వ్యక్తిత్వం కలిగిన రవి నాయక్ అకాల మరణం నన్నెంతో కలచివేసింది" అని భావోద్వేగానికి గురయ్యారు. రవి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసే సమయంలో ఆయన కంటతడి పెట్టుకు న్నారు. గిరిజన కుటుంబంలో జన్మించిన రవి నాయక్ కష్టపడి న్యాయవాదిగా ఎదిగి, ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలంది ంచారని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా ఇల్లందు, కొత్తగూడెం, ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన గిరిజనుల న్యాయ సమస్యలను తన సమస్యలుగా భావించి, వారికి న్యాయం జరిగేలా అంకితభావంతో కృషి చేశారని కొనియాడారు. గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న మాట్లాడుతూ, రవి నాయక్ మృతి న్యాయవ్యవస్థకు, గిరిజన సమాజానికి తీరని లోటని అన్నారు. చిన్న వయసులోనే ఉన్నత స్థాయికి ఎదిగి ఎందరికో న్యాయ సహాయం చేసిన వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రమేష్, ఆడప పుల్లారావు, దమ్మలపాటి ప్రసాద్, ప్రముఖ వ్యాపారవేత్త కాటేపల్లి నవీన్, న్యాయవాది ధారావత్ చందు నాయక్, వాంకుడోత్ విజయ్ తదితరులు పాల్గొని రవి నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు.



# హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ, రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వన మహోత్సవం



## ప్రతి ఇంటికి ఉచితంగా ఐదు మొక్కల పంపిణీ

**మేడ్చల్ జూలై 25(పీపుల్స్ డైరీ):-** హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ, రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వన మహోత్సవం--2026 సందర్భంగా ప్రతి ఇంటికి ఉచితంగా ఐదు మొక్కలు పంపిణీ చేశారు. ఇందులో మూడు పండ్ల మొక్కలు, రెండు అలంకరణ/ఔషధ మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహితి గోపిడి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో పచ్చదనాన్ని పెంచడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భూగర్భ జలాలను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం లక్ష్యంగా ప్రజలను, ముఖ్యంగా మహిళలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి బండి రమేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వన మహోత్సవం--2026లో రాష్ట్రవ్యాప్తంగా 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మందలపు సాయిబాబు చౌదరి, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ డైరెక్టర్ (హార్టికల్చర్) చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్ తదితరులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం

## ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన పాఠశాల బస్సు




**మేడ్చల్ జూలై 26 (పీపుల్స్ డైరీ):-** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని జనతా దాబా వద్ద ఆగి ఉన్న లారీని సెయింట్ క్లారిట్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఇద్దరు విద్యార్థులు ఉండగా, వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి విద్యార్థులను ద్విచక్ర వాహనాలపై సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేదని సమాచారం. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే 108 సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకొని బాధితులకు వైద్యం అందిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# పీజీ విద్యార్థిని ఆత్మహత్య

## మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారంలో విషాదం



వీదీదీూ పూర్తి చేసి , బెంగుళూరు లో సిద్ధార్థ కళాశాల లో పీజీ చేస్తున్న విద్యార్థిని దీక్షిత 26 సం"లు ఆత్మహత్య.. గత వారం నాగారం లోని వెస్ట్ గాంధీనగర్ లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చిన దీక్షిత..సాయంత్రం అపార్ట్మెంట్ పై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన దీక్షిత , చికిత్స పొందుతూ మృతి..మృతురాలి స్వస్థలం యాదాద్రి జిల్లా బొమ్మల రామారాం , మైలారం గ్రామం , నాగారంలో స్థిరపడ్డార మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదు మేరకు , కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# ఘనంగా వారాంతపు సంత ప్రారంభం



**ఏటూరు నాగారం జులై 25 (పీపుల్స్ డైరీ) :** ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతూ, తొలి ఏకాదశిని పురస్కరించుకుని ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత శనివారం అధికారికంగా ప్రారంభమైంది. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ఈ సంతను ఘనంగా ప్రారంభించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుండి కూరగాయల మార్కెట్ మీదుగా, బోడ్రాయి వరకు మరియు బోడ్రాయి నుండి చేపల మార్కెట్ వరకు ఈ సంత నిర్వహించబడుతుంది సర్పంచ్ గారు తెలపడం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమ ంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, రైతులు, వ్యాపారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## శంకుస్థాపన చేసిన సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు



**ఏటూరునాగారం జులై 25 (పీపుల్స్ డైరీ) :** స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 3వ, మరియు 6వ, వార్డులలో ప్రజల సౌకర్యార్థం నూతన డ్రైనేజీల, కల్వర్టులు మరియు కొత్త రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. వార్డుల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు గారు, కార్యదర్శి జనార్ధన్, ఎండి వలీ బాబా, తాడూరి రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, శ్రీరాములు, వార్డు మెంబర్ బట్టు మానస గోపి, 6. వార్డు సభ్యులు ఉమ్మనేని రమేష్, 5 వ, వార్డ్ మెంబర్ కొండాయి చిన్ని, మాధురి మధు, ఎస్.కె బాబా, గోగు వెంకన్న, మెరుగు వెంకటేశ్వర్లు, బట్టు కొము రయ్య, ప్రమీల, ఎర్రల సారయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ పంచాయతీ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
ఆదివారం, 26 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 138


# గుండ్లపోచంపల్లిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమీక్ష సమావేశంలో సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి



**మేడ్చల్ జూలై 25 (పీపుల్స్ డైరీ):-** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 299 గుండ్లపోచంపల్లి డివిజన్ కండ్లకొయ్యలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమీక్ష సమావేశంలో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటి ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని బీఎల్ఓలు, బీఎల్ఏలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, మాజీ మండల అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్, మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సంజీవ రెడ్డి, వీరస్వామి, యాదగిరి, వెంకట్, జయరాజ్, శ్రీకాంత్ రెడ్డి, దొడ్ల మోహన్, మహిళా నాయకురాలు ప్రేమలతతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తోటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**జమ్మికుంట జులై 25 పీపుల్స్ డైరీ :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఇటీవల ఆర్థిక పరిస్థితి బాగాలేక ఆత్మహత్యకు పాల్పడి మరణించిన కేబుల్ ఆపరేటర్ రామ్మూర్తి కుటుంబానికి తోటి కేబుల్ మిత్రులు అండగా నిలిచారు. ఆర్థిక సహాయంగా 10016 రూపాయలను ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలో ఒకడు తన ఆర్థిక పరిస్థితులు బాగోలేక మరణించినప్పటికీ వారి కుటుంబానికి పెద్దదిక్కుగా మా కేబుల్ ఆపరేటర్ల మందిరము తోడుంటామని అలాగే మా నుండి దూరమైన రామ్మూర్తికి ఘనంగా నివాళులర్పించామని, మా కేబుల్ ఆపరేటర్లు అందరూ రామ్మూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొనగంటి వెంకన్న, దాసరి సదానంద, అక్కినపల్లి నవీన్ కుమార్, మదెర్ల కుమారస్వామి, ఆముదాల ధనంజయ్, హౌసింగ్ బోర్డ్ కుమారస్వామి, ఎర కొండ నారాయణ సంజీవ్, సాంబయ్య టౌన్ ఆపరేటర్లు పాల్గొన్నారు

# నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు జూలై 31 వరకు దరఖాస్తులు

**నవంబర్ 28న ప్రవేశ పరీక్ష -- గ్రామీణ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉచిత విద్యా అవకాశం**



**మేడ్చల్ జూలై 25 (పీపుల్స్ డైరీ):-** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువు జూలై 31, 2026 వరకు ఉందని ప్రధానాచార్యులు కె. మాధవరావు తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ప్రవేశాలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఎలాంటి దరఖాస్తు రుసుము లేదని స్పష్టం చేశారు. మొత్తం 40సీట్లు అందుబాటులో ఉండగా, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించారు.ప్రవేశ పరీక్షను నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత నాణ్యమైన విద్య, వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, ఇతర సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అందించబడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానాచార్యులు కె. మాధవరావు తల్లిదండ్రులు, విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ఎర్ర సత్యం జయంతి వేడుకలు



**నారాయణపేట, జూలై 25 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ ముదిరాజ్ సంఘం సారథ్యంలో శనివారం నాడు దివంగత జడ్చర్ల ఎమ్మెల్యే మరాఠీ సత్యనారాయణ ఎలియాస్ ఎర్ర సత్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు స్థానిక బస్టాండ్ దగ్గర ఏర్పాటుచేసిన ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బర్డే కేక్ ను కట్ చేశారు ఈ సందర్భంగా ఎర్ర సత్యం అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యపార్యస్రామిక సహకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు నీరటి నరసింహనాయుడు అఖిలపక్షం నాయకులు చంద్రశేఖర్ బాల నరసింహులు సచిన్ రవికుమార్ జయప్రకాష్ శివరాములు వెంకట్ రాములు సంద బాలరాజ్ రామాంజనేయులు రాజలింగం జయప్రకాష్ సహకపూర్ మంగలి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరం

**జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ..**



**భూపాలపల్లి జూలై 25 పీపుల్స్ డైరీ..** జిల్లాలో డబుల్ ఓటు లేకుండా ప్రతి ఓటరికి ఒక్కటే ఓటు ఉండేలా చేపట్టిన సర్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. శనివారం ఐడిఓసి. కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీ కరణపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అండ్ కలెక్టర్ మాట్లాడు తూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి యువత ఓటరుగా నమోదు కావాలని, అందుకు రాజకీయ పార్టీలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేర్ల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపులను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లు నియమించుకోవడం ద్వారా ఈ ప్రక్రియ మరింత సమర్థవంతంగా జరుగుతుందని సూచించారు.సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచించారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో కొన్ని వార్డుల్లో నమోదు తక్కువగా ఉన్నందున ఆయా వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియ 84.12 శాతం పూర్తి అయిందని అయితే పురపాలక పరిధిలో 70 శాతం జరిగిందని వేగవంతానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. సర్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీతో ముగియనున్నందున అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, నవీన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు తెలియజేశారు.

# రిజర్వేషన్ డే విజయవంతానికి సంపూర్ణ మద్దతు

- రిజర్వేషన్ డేకు అంబేద్కర్ సంఘం మద్దతు
- అంబేద్కర్‌వాదులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: చెప్యాల ప్రకాష్



**హుజురాబాద్, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూలై 26న ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి సందర్భంగా తెలంగాణ బహుజన సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిజర్వేషన్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు.

**పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపు**

ఈ కార్యక్రమానికి తెలంగాణ అంబేద్కర్ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. హుజురాబాద్‌కు చెందిన అంబేద్కర్‌వాదులు, ప్రజాసంఘాల నాయకులు, సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

**సాహు మహారాజ్ సేవలు చిరస్మరణీయం**

1902లో కొల్హాపూర్ సంస్థానంలో ఛత్రపతి సాహు మహారాజ్ 50 శాతం రిజర్వేషన్లను అమలు చేసి సామాజిక న్యాయానికి నాంది పలికారని చెప్యాల ప్రకాష్ పేర్కొన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించారని గుర్తు చేశారు.

**హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం అవసరం**

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించిన ఆయన, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు పొన్నాల వినోద్ కుమార్, మొలుగూరి ప్రభాకర్, బత్తుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్- ఆయన ఆశయాలను కొనసాగించాలి

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్



**ఎల్కతుర్తి జులై 25 (పీపుల్స్ డైరీ ) :** బీసీ కులాల విముక్తి ప్రదాత పూలే ,సాహుజి మహారాజ్ ,బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం ,దళిత క్రైస్తవుల సమస్యలు గత దశాబ్దన్నర కాలంగా భారతదేశంలో అణచివేయబడ్డ వర్గాలకు రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు నిర్వీర్యం చేయబడ్డాయి. శనివారం మండల కేంద్రంలోని సూరారం గ్రామంలో అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ 78 సంవత్సరాలు గడుస్తున్న భారత దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ఏదో ఒక దగ్గర ఎస్సీ ,ఎస్టీ ,బీసీల పైన దళిత బడుగు బలహీన వర్గాల పైన దాడులు దౌర్జన్యాలు హత్యలు మర్డర్లు మానభంగాలు కులాహంకారాత్యాలు రాజకీయ హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. మతపరమైన ఘర్షణలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో వివిధ ప్రాంతాలలో దాడులు జరుగుతుంది రోజు మహిళల , మైనర్ బాలికలను అత్యాచారాలు చేయడం వాటిపైన ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని అటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను తెలంగాణ అంబేద్కర్ సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నాంఅన్నారు .చత్రపతి సాహుజి మహారాజ్ 1874 సంవత్సరంలో జూన్ 26 మహారాష్ట్రలో జన్మించిన సాహు మహారాజు గారు 1894లో కొల్హాపూర్ చక్రవర్తి అధికారంలోకి వచ్చినారు తన ప్రభుత్వం ద్వారా 1902 సంవత్సరంలో దేశంలో మొదటిసారిగా వెనుకబడిన కులాలకు 50% రిజర్వేషన్లు అమలుపరిచిన 1901 లో జైన్ హాస్టల్ విక్టోరియా బరారి హాస్టల్ ,1906 లో మహమ్మదీయ విద్యార్థుల హాస్టల్ 1908లో మిస్ క్లర్క్ హాస్టల్ ప్రారంభించిన రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ అని అన్నారు. బహుజనులు ఈ సమాజంలో మనుషులుగా జీవిస్తున్నారంటే విద్యా ,ఉ ద్యోగాలు చేస్తున్నారంటే దానికి కారణం సాహూజి కృషి ఫలితం బహుజన సేన ఆధ్వర్యంలో జులై 26న రిజర్వేషన్ డే ను ఘనంగా నిర్వహించే పూలే ,సాహుజి ,అంబేద్కర్ల ఆలోచన ఈ సమాజంలో తీసుకెళ్లడానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జులై 26 న సభను విజయవంతం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు మొలుగురు రమేష్, మేకల బాబు ఉపసర్పంచ్ , మారుపాక రవీందర్ 9వ వార్డు సభ్యులు ,పొన్నాల వినోద్ కుమార్ అంబేద్కర్ సంఘం నాయకులు, మేకల కిషన్ అంబేద్కర్ నాయకులు, మణుగూరు జేమ్స్, గడిపే ప్రశాంత్ ,మేకల శంకర్ ,మణుగూరు భాస్కర్ ,మేకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే: వొడితల ప్రణవ్

- విద్యార్థుల పోరాటానికి కేంద్రం తలొగ్గిందని వ్యాఖ్య
- భవిష్యత్తులో ప్రజా సమస్యలపై మరిన్ని ఉద్యమాలు చేస్తామని వెల్లడి



**హుజురాబాద్, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులు మొదటి నుంచి చేస్తున్న డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష లీకేజీ అనంతరం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా వారి తరపున పోరాటం చేశారని తెలిపారు.

**విద్యార్థుల పోరాటానికి ఫలితం**

విద్యార్థులు ప్రధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేశారని, ఆ డిమాండ్ నెరవేరడం వారి పోరాట విజయమని ప్రణవ్ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పార్లమెంట్‌లోనూ కాంగ్రెస్ పార్టీ గట్టిగా గళం వినిపించిందని పేర్కొన్నారు.

రైతుల తర్వాత విద్యార్థుల ఉద్యమానికీ కేంద్రం తలొగ్గిందిగతంలో రైతుల ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గి వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు విద్యార్థుల ఉద్యమం విషయంలోనూ కేంద్రం వెనక్కి తగ్గాల్సి వచ్చిందన్నారు.

**ప్రజా సమస్యలపై ఉద్యమాలు కొనసాగిస్తాం**

విద్యార్థుల ప్రయోజనాల విషయం లో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి భేషజాలు లేవని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో కూడా ప్రజలతో కలిసి మరిన్ని ఉ ద్యమాలు చేపడతా మని వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు.

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**



**రేగొండ జూలై 25 పీపుల్స్ డైరీ..**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)ను వేగవంతం చేయాలని, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ను అత్యంత కచ్చితత్వంతో, వేగవంతంగా పూర్తిచేయాలని నియోజక వర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రేగొండ మండల కేంద్రంలోనీ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటరు వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతిఫారాన్ని నిశితంగా పరిశీలించి డిజిటలైజ్ చేయాలని సూచించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ఓటర్లకు నాణ్యమైన సేవలందించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు.ఈ మేరకు రేగొండ గోరి కొత్తపల్లి,చిట్యాల ,టేకుమట్ల మండలాల్లో సర్ ప్రక్రియ మందకొడిగా సాగుతోందన్నారు. మండ లాల్లో పర్సంటేజ్ తగ్గడంపై బి ఎల్ ఓ లు,బి ఎల్ ఎ లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. బీఎల్వోలకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించేలా సూచనలివ్వాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని, ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో పౌర సరఫరాలశాఖ సిబ్బంది, బూత్ స్థాయి ఏజెంట్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. చనిపోయిన, వలసవెళ్లిన, తప్పుగా నమోదైన ఓటర్లు, తొలగించాల్సిన ఓట్లు, ఇతర పోలింగ్ కేంద్రాలకు మారిన ఓటర్ల వివరాలను ధ్రువీకరించి వెంటనే పోర్టల్‌లో నమోదుచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గడువులోగా కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,నాయకులు పాల్గొన్నారు..

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 26 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 138


# గోదావరి పుష్కరాలు ఏర్పాట్లపై రాష్ట్ర డీజీపీ మహేష్ భగవత్ వీడియో కాన్ఫరెన్స్



**నిజామాబాద్, ఆర్మూర్, జూలై,25 (పీపుల్స్ డైరీ) :**రాబోయే గోదావరి పుష్కరాలు--2027ను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా , ప్రశాంతంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) శ్రీ మహేష్ భగవత్, ఐపీఎస్., గోదావరి పరివాహక ప్రాంతాల ఎస్పీలు , పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు , ట్రాఫిక్ నియంత్రణ , భక్తుల రద్దీ నిర్వహణ , అత్యవసర సేవల సమన్వయం , విపత్తు నిర్వహణ , కమ్యూనికేషన్ వ్యవస్థల బలోపేతం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెంజల్ , మెండోరా , ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న పుష్కర ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక పోలీస్ అవుట్‌పోస్టుల ఏర్పాటు , ఆధునిక సౌకర్యాలతో కమాండ్ అండ్ కంట్రోల్ హాల్ నిర్మాణం , సీసీటీవీ కెమెరాల విస్తరణ , డ్రోన్ నిఘా , పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ , బ్యారికేడింగ్ , పార్కింగ్ ప్రణాళిక , ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు , మహిళలు, చిన్నారులు , వృద్ధుల కోసం ప్రత్యేక సహాయక కేంద్రాల ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అదేవిధంగా పుష్కరాల సమయంలో భారీగా వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్ నిర్వహణ , విపత్తు నిర్వహణ బృందాల సిద్ధత , అగ్నిమాపక, వైద్య , ఎన్‌డీఆర్‌ఎఫ్ /ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయం , తాగునీరు , లైటింగ్ , పారిశుద్ధ్యం , తప్పిపోయిన వారి కోసం ప్రత్యేక కేంద్రాలు , సమాచార వ్యవస్థల బలోపేతం వంటి అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. ప్రతి పోలీస్ యూనిట్ ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని , అన్ని శాఖలతో సమన్వయం పెంచుకొని భక్తులకు సురక్షితమైన , సౌకర్యవంతమైన పుష్కరాలను అందించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) శ్రీ మహేష్ భగవత్, ఐపీఎస్ గారు అధికారులను ఆదేశించారు. ఇట్టి వీడియో కాన్ఫిడెన్స్ లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., , అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ ఎన్. శుభం ప్రకాశ్ , నిజామాబాద్ , ఆర్మూర్, బోధన్ ఏసీపీలు శ్రీ ప్రకాష్ , శ్రీ వెంకటేశ్వర రెడ్డి , శ్రీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , మల్లేష్ నిజామాబాదు గోదావరి పారివాక ప్రాంతంలోని సిఐలు , ఎస్సైలు , ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# మేడ్చల్ రైల్వే స్టేషన్ రోడ్డులో అక్రమ షెడ్ల కూల్చివేత



**మేడ్చల్ జూలై 25 (పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ పట్టణంలో ప్రజా రహదారుల ఆక్రమణలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉక్కుపాదం మోపారు. రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమతులు లేకుండా రహదారి స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ రేకుల షెడ్లను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ భాస్కర్, టీపీఎస్ సాయితేజ ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు చేపట్టారు. జేసీబీ సాయంతో రహదారిని ఆక్రమించిన నిర్మాణాలను తొలగించి, ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో రహదారుల ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు హెచ్చరిస్తూ, రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, పట్టణ ప్రణాళిక నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజా రహదారులను ఆక్రమణల నుంచి విముక్తం చేయడానికి ఇటువంటి చర్యలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. స్థానికులు కూడా ఈ చర్యలను స్వాగతిస్తూ, పట్టణంలో ఉన్న ఇతర ఆక్రమణలపైనా ఇదే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పూడూరు విద్యార్థిని శ్రీలాస్యకు అంతర్జాతీయ స్వర్ణ రికార్డుల పురస్కారం

- **కూచిపూడి నృత్యంలో ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు పూడూరు గ్రామానికి గర్వకారణం**



**మేడ్చల్ జూలై 25 (పీపుల్స్ డైరీ):-** పూడూర్--కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని పూడూరుకు చెందిన విద్యార్థిని తోకల శ్రీలాస్య అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించి గ్రామంతో పాటు జిల్లా ప్రతిష్ఠను పెంచింది. కూచిపూడి నృత్యంలో ఆమె కనబరిచిన విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా సార్వత్రిక స్వర్ణ రికార్డుల (యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్స్) సంస్థ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. మేడ్చల్ పట్టణంలోని నాగార్జున మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీలాస్య చిన్న వయసులోనే నృత్య కళపై ఆసక్తి పెంచుకుని, ప్రముఖ నృత్య గురువు డాక్టర్ గల్వ యుగమణి ఆధ్వర్యంలోని నాట్య మయూరి కళాక్షేత్రంలో క్రమశిక్షణతో శిక్షణ పొందుతోంది. ఆమె అంకితభావం, సాధన, కళాప్రతిభ ఈ అరుదైన గౌరవాన్ని అందుకునేలా చేశాయి. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్స్ చైర్మన్ జునాపూడి రవివర్మ చేతుల మీదుగా శ్రీలాస్యకు ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆమె తల్లిదండ్రులు తోకల శ్రీనివాస్, ప్రశాంతి హాజరై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గల్వ యుగమణి మాట్లాడుతూ, విద్యార్థిని శ్రీలాస్య కృషి, పట్టుదల, అంకితభావమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలుగు రాష్ట్రాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, నాట్య మయూరి కళాక్షేత్రం సభ్యులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు శ్రీలాస్యను అభినందిస్తూ, పూడూరు గ్రామానికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గ్రామానికి, మేడ్చల్ జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. యువతకు ఆమె విజయం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరం

**జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ..**



**భూపాలపల్లి జూలై 25 పీపుల్స్ డైరీ..**జిల్లాలో డబుల్ ఓటు లేకుండా ప్రతి ఓటరికి ఒక్కటే ఓటు ఉండేలా చేపట్టిన సర్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. శనివారం ఐడిఓసి. కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అండ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి యువత ఓటరుగా నమోదు కావాలని, అందుకు రాజకీయ పార్టీలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేర్ల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపులను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లు నియమించుకోవడం ద్వారా ఈ ప్రక్రియ మరింత సమ-ర్థవంతంగా జరుగుతుందని సూచించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచించారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో కొన్ని వార్డుల్లో నమోదు తక్కువగా ఉన్నందున ఆయా వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియ 84.12 శాతం పూర్తి అయిందని అయితే పురపాలక పరిధిలో 70 శాతం జరిగిందని వేగవంతానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. సర్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీతో ముగియనున్నందున అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, నవీన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు తెలియజేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా -దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయం


- **దేశంలో మహిళలు, యువత పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తి: రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్**



**శంకర్‌పల్లి: జులై 25:** నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఈ దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయమని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ అన్నారు. దేశంలో మహిళలు, యువత చేస్తున్న పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తినిస్తుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే అవినీతి బురదలో నిండా మునిగిపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైందని ఆమె అన్నారు. విద్యా వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి, దేశ యువత ఆశలను, ఆశయాలను అధికార మదంతో అణచివేయాలని చూసిన మోడీ నియంతృత్వానికి రోజులు దగ్గర పడ్డాయని శ్రీజ్యోతి భీమ్ భరత్ విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ దేశ యువత పోరాటాన్ని ఆపబోదని, రాబోయే కాలంలో అన్ని శాఖల మంత్రులు, మోడీతో సహా గద్దె దిగాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ దేశ యువత చేస్తున్న పోరాటంలో వారితో పాటు నిలిచి లాఠీ దెబ్బలు తిని, అక్రమ అరెస్టులకు సైతం సిద్ధపడిన కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని తెలిపారు. ఈ సందర్భంగా వెన్నుచూపకుండా మోడీ నియంతృత్వానికి వ్యతిరేకంగా, జాతి, కుల, మత, ప్రాంతీయ భేదాలను తొలగిస్తూ పోరాడి, విజయం సాధించిన ఈ దేశ యువత పోరాట స్ఫూర్తిని శ్రీజ్యోతి భీమ్ భరత్ అభినందించారు.

# విద్యార్థుల పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేపడుతాము

**మాల సామాజిక న్యాయవేదిక జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్**



**ఏటూరు నాగరం జులై 25 (పీపుల్స్ డైరీ) :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల పోరాట విజయమని మాల సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాయని అన్నారు. విద్యార్థుల ఆందోళనల ఫలితంగానే మంత్రి రాజీనామా జరిగిందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతిన్నదని అన్నారు. లీకేజీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇటువంటి ఘటనలను అరికట్టవచ్చని సూచించారు. నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొంది ంచాలని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమాలు కొనసాగిస్తామని గంపల శివకుమార్ తెలిపారు.


# ప్రత్యామ్నాయ పంటల సాగు పై విస్తృత ప్రచారం చేయాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**ఏటూరు నాగారం జులై 25 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని, ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ , సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తో కలిసి కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కేడ్ హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి పంటల వైవిధ్యీకరణ అత్యంత ముఖ్యమైన అజెండా ఉందని, గత ఏడాది ఇదే తేదీ నాటికి రాష్ట్రంలో సుమారు 52 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి విత్తనం పూర్తైందని వివరించారు. ఈనెల 27 నుండి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించే ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలని, కంది, పెసర, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, అలసందలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, చిరుధాన్యాలు వంటి పంటలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందేలా పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా కుట్టు పనులు, యూనిఫాంల నాణ్యతను జిల్లా, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ ఆయిల్ పామ్ తోటలు, డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును నిరంతరం పర్యవేక్షించాలని వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం ఆగస్టులో కొంత వర్షం కురిసే అవకాశం ఉన్నప్పటికీ అధిక నీటి అవసరమున్న పంటలకు అది సరిపోదని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, అదనపు డీఆర్‌డీఓ రవీందర్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, డి ఎం హెచ్ ఓ గోపాల్ రావు, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ బిక్షపతి, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారి అప్పలనాయుడు, డి డబ్ల్యూ ఓ ప్రేమ లత, ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఈ సునీత, ఏపీడీవో శివకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంతర్ముఖం సిల్వర్ జూబ్లీ వేడుకలలో సీనియర్ జర్నలిస్ట్ అస్లంకు సన్మానం



**మిర్యాలగూడ :**లోకల్ కేబుల్ వార్తలు ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో అంతర్ముఖం సిల్వర్ జూబ్లీ-2026 వేడుకలు శనివారం పట్టణంలోని వైష్ణవి గ్రాండ్ సమావేశం హాల్లో అంతర్ముఖం నిర్వాహకులు, చైర్మన్ మర్రి ఎలియాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఖాజ హామీదుద్దీన్, నాగయ్య లను ఘనంగా సన్మానించారు. సీనియర్ జర్నలిస్ట్ ఎండి అస్లంకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అంతర్ముఖం చైర్మన్ ఎలియాస్ లు, శాలువా కప్పి, మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలు, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్, డాక్టర్ రాజు, టిఆర్ఎస్ జిల్లా నాయకులు మోసిన్ అలీ,తెలంగాణ ఉద్యమకారుడు ప్రభాకర్ కస్తూరి, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, కౌన్సిలర్ అశోక్, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరి బాలకృష్ణ గుడిపాటి నవీన్ కుమార్, అయూబ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, హెచ్. డబ్ల్యు.పి.ఎల్. సంస్థ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## తెల్ల చీరలో దేవకన్యలా మెరిసిపోతున్న ఆషికా రంగనాథ్

ఆషికా రంగనాథ్ పరిచయం అవసరం లేదు. అందానికి అందం, ప్రతిభతో వేగంగా తనను తాను ఎస్టాబ్లిష్ చేసుకుంది ఈ బ్యూటీ. నాగార్జున, రవితేజ లాంటి అగ్ర హీరోల సరసన నటించిన ఆషిక అరుదైన ప్రతిభావనిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇక సోషల్ మీడియాలోను ఈ అమ్మడికి ఫాలోయింగ్ అసాధారణంగా ఉంది. తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొత్త ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. -ది వైట్స్ దట్ నెవ్వర్ మేడ్ ఇట్ టు ది గ్రామ్- అనే క్యాప్షన్‌తో ఆషిక షేర్ చేసిన ఈ వైట్ కలర్ ఔట్‌ఫిట్ ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి చీరలో దేవకన్యలా మెరిసిపోతున్న ఆషిక గ్లామరస్ లుక్స్ చూసి అభిమానులు పరవశించిపోతున్నారు.

ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే వేలాది లైక్స్, కామెంట్లతో నెట్టింట ట్రెండింగ్‌గా మారాయి. వైట్ కలర్ నీకు పర్ఫెక్ట్‌గా సెట్ అయింది.. బ్యూటీ క్వీన్.. అంటూ నెటిజన్లు లవ్, హార్ట్ ఎమోజీలతో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. నాగార్జున సరసన -నా సామి రంగా- సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆషికా తన అందం, నటనతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.



## సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్




కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా: నిధి అగర్వాల్

సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

## సినిమాల్లోనే కాదు.. పెట్టుబడుల్లోనూ నయనతార సూపర్ ప్లానింగ్!



ఇటీవలి కాలంలో సినీ ప్రముఖుల పెట్టుబడుల ధోరణిలో రియల్ ఎస్టేట్ కీలక స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని ప్రైమ్ లొకేషన్లలో లగ్జరీ ఇళ్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేయడం స్టార్‌లలో పెరుగుతున్న ట్రెండ్‌గా కనిపిస్తోంది. కెరీర్‌లో సంపాదించిన ధనాన్ని దీర్ఘకాలిక ఆస్తులుగా మార్చుకోవడం, కుటుంబానికి ఒక మంచి సేఫ్టీ, లగ్జరీ ఇంటిని ఏర్పరచుకోవడం, ఫ్యూచర్ పెట్టుబడిగా వాల్యూ పెరిగే ఏరియాను సెలెక్ట్ చేసుకోవడం వంటి కారణాలతో సినీ ప్రముఖులు రియల్ ఎస్టేట్‌పై ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ట్రెండ్‌లో తాజాగా సౌత్ స్టార్ హీరోయిన్ నయనతార పేరు కూడా చేరింది. చెన్నైలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రాంతాల్లో ఒకటైన పోయెస్ గార్డెన్‌లో సుమారు రూ.40 కోట్ల విలువైన లగ్జరీ విల్లాను ఆమె కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ కొనుగోలు సినీ, రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది. చెన్నైలో పోయెస్ గార్డెన్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్నో దశాబ్దాలుగా ఇది రాజకీయ, సినీ ప్రముఖులుండే ఏరియాగా పేరొందింది. ప్రశాంతమైన వాతావరణం, అత్యున్నత భద్రత, నగరంలోని కీలక ప్రాంతాలకు అనుసంధానం, పరిమిత స్థల లభ్యత వంటి అంశాలు ఈ ఏరియాను అత్యంత విలువైన అడ్రస్‌గా నిలబెట్టాయి. అందుకే ఇక్కడ ఆస్తి కొనుగోలు చేయడం కేవలం నివాస అవసరంగా కాకుండా, ప్రిస్టీజియస్ ఇన్వెస్ట్‌మెంట్‌గా కూడా పరిగణించబడుతోంది. గత కొన్నేళ్లుగా స్టార్ నటీనటులు కమర్షియల్ ప్రాపర్టీలు, లగ్జరీ విల్లాలు, హైఎండ్ రెసిడెన్షియల్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెంచుతున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం సినిమా ఆదాయం పైనే ఆధారపడకుండా, ఆస్తుల రూపంలో సంపదను విస్తరించుకోవడం ఇప్పుడు సెలబ్రిటీల ఆర్థిక ప్రణాళికలో భాగంగా మారిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రైమ్ లొకేషన్లలో ల్యాండ్ వాల్యూ రెగ్యులర్ గా పెరుగుతుండటంతో, ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్స్ ఫ్యూచర్ లో మరింత లాభదాయకంగా మారే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్





**మట్టెవాడ, జూలై 25 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న శనివారం 26వ డివిజన్‌లోని చార్‌బౌలి ప్రాంతంలో ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. చెత్త సేకరణ వాహనం నిర్ణీత సమయానికి వస్తుందా, తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తున్నారా, కంపార్ట్ మెంట్‌ల వారీగా చెత్త సేకరణ జరుగుతోందా అనే అంశాలను తెలుసుకున్నారు. అనంతరం నర్సంపేట గ్రాండ్ ఎంట్రెన్స్, ఖమ్మం గ్రాండ్ ఎంట్రెన్స్ ప్రాంతాలను సందర్శించిన కమిషనర్, సివిల్ పనులు పూర్తయినందున వెంటనే ఫీనిషింగ్, హార్టికల్చర్, సుందరీకరణ పనులను పూర్తి చేసి నగర ప్రవేశ మార్గాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అలంకార మొక్కలతో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సెంట్రల్ మీడియన్‌లలో ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తొలగిస్తూ, అలంకరంగా ఉండేలా నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా స్వీపింగ్ మిషన్‌తో చేపడుతున్న రహదారి శుభ్రత పనులను పరిశీలించిన కమిషనర్ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించి ప్రధాన రహదారులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై కమిషనర్ ఆరా

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను కమిషనర్ వెంకన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫారాలు అందచేశారా, డిజిటలైజేషన్ ఏ దశలో ఉందనే వివరాలను నగర ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు కమిషనర్ ఎస్ఐఆర్ ఫారాలను ఆగస్టు 3వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా అందచేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో కమిషనర్ వెంట సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఎన్‌హెచ్ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్ వైజర్లు గోల్కొండ శ్రీను, భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ : డాక్టర్ అనితా రెడ్డి

**మట్టెవాడ, జూలై 25 (పీపుల్స్ డైరీ):** అనురాగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి హన్మకొండలోని వికాస్ మనోవికాస మానసిక దివ్యాంగుల ఆశ్రమం సందర్శించి పిల్లల క్షేమ సమాచారం, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నోట్ బుక్స్ ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల విద్యకు సహకరించాలని భావించి ఈ కార్యక్రమం చేశామని, మానసిక దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవతో సమానం అన్నారు. అక్షరాస్యతలో దివ్యాంగులు ముందుండేలా వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఒకరి విద్యకు సహకరించడం అంటే ఓ కుటుంబాన్ని అభివృద్ధి పరచడమేనన్నారు. పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, వీరికి తోచిన మేర సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ అనితారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మనో వికాస్ ఆశ్రమ నిర్వాహకులు విశాలి, టీచర్లు, విద్యార్థులు. సిబ్బంది పాల్గొన్నారు.

## ఓ సిటీలో వైభవంగా బీరన్న బోనాలు

### బోనం ఎత్తి మొక్కులు చెల్లించుకున్న ఎర్రబెల్లి



**మట్టెవాడ, జూలై 25 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ఓ సిటీలోని బీరన్న బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, భక్తులతో కలిసి ఆయన సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు స్వయంగా తలపై బోనం ఎత్తి బీరన్న స్వామివారికి తన భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని కొనియాడారు. మన ఊరు, మన ప్రజలు చల్లగా ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆ బీరన్న స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



## బీసీ బిల్లుపై కేంద్ర ప్రభుత్వ, నిర్లక్ష్యం తగదు

### బీసీ నేత సాయిలు ప్రభాకర్ ధ్వజం

**గీసుకొండ, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి కార్యాలయం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం నాయకులు సాయిలు ప్రభాకర్ తీవ్ర మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో బీసీల స్థితిగతులు, హక్కుల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లును ఏకగ్రీవంగా తీర్మానం చేసి, గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, బిల్లు పంపి ఇన్ని రోజులవుతున్నా కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్రపతి కార్యాలయం గానీ దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం..

## తహసీల్దార్ కార్యాలయానికి ఎమ్మెల్యే స్థల పరిశీలన





**ఆత్మకూర్, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు విశాలమైన, ఆధునిక సౌకర్యాలతో కూడిన తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పునర్నిర్మాణం చేయనున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనా నికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శనివారం రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదిత స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, భవన నిర్మాణానికి సంబంధించిన ప్రణా ళికలు, అవసరమైన మౌలిక వసతులు, ప్రజలకు అందించే సేవలపై అధికారుల తో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు విశాలమైన, ఆధునిక సౌకర్యాలతో కూడిన తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ రెవెన్యూ సంబంధిత పనులను సులభంగా పూర్తి చేసుకునేలా కార్యాలయంలో అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామ ని చెప్పారు. భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మండల ప్రజలకు ఉపయోగపడే విధంగా సౌకర్యవంతమైన కార్యాలయ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రమేష్, సర్పంచ్ సాంబయ్య, డిసిసి కమిటీ సభ్యులు రవికుమార్, కక్కెర్ల రాజు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, నాయకులు జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయమే

### పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్



**ఆత్మకూర్, జులై 25 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఐక్య ఉద్యమం, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, యూత్ కాంగ్రెస్ చేపట్టిన పోరాటానికి దక్కిన విజయమని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. శనివారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళనల ఫలితంగానే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. బీజేపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఇది ఆ పార్టీకి తొలి ఎదురుదెబ్బ అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రజలతో కలిసి ఉద్యమాలను కొనసాగిస్తుందని తెలిపారు. విద్యార్థుల ఉద్యమంలో పాల్గొని కేసులు, లాఠీచార్జీలను ఎదుర్కొన్న యువత, విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## అర్వణపల్లి బీరన్న గుడిలో కురుమ సంఘం బోనాల వేడుకలు

**కేసముద్రం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కేసముద్రం మండలం అర్వణపల్లి గ్రామంలోని బీరన్న గుడిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే కురుమ సంఘ మహిళలు కొత్త కుండల్లో బోనం వండి, పసుపు కుంకుమ, వేపాకులతో అలంకరించి డప్పులు, భజనలతో గుడికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం బీరన్న స్వామికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీర వెంకటమ్మ, ఉపసర్పంచ్ కంచ రాధిక శ్రీను పాల్గొని బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కురుమ సంఘ ఐక్యతను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కురుమ కులానికి బీరన్న స్వామి ఆరాధ్య దైవమని, ఆయన ఆశీస్సులతో కురుమ కుటుంబాలన్నీ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ప్రభుత్వం కురుమల సంక్షేమానికి, గొర్రెల పంపిణీ పథకాన్ని



మరింత పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు కంచ కుమారుస్వామి, కంచ సాయిబాబా చీర భద్రయ్య, కెంచ మొగిలి కంచ శ్రీను చీర కిష్టయ్య చీర వెంకన్న గోవిందు కుమార్ కొనగొండ సాయిబాబా కుల పెద్దలు యువజన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యం

**చిట్యాల, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని వెంటనే భర్తీ చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశం కర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నుండి ప్రస్తుత ప్రభుత్వం వరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో భర్తీకి నోచుకోకుండా ఎస్సీ ఎస్టీలకు మాత్రమే సంబంధించిన బ్యాక్ లాగ్ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం బ్యాక్లాగ్ ఉద్యోగాల నియామక క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలన్నారు.

## మాదిగలు రాజకీయంగా ఎదగాలి

### మండల అధ్యక్షుడు శంకర్ మాదిగ

**చిట్యాల, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** మాదిగలు రాజకీయంగా ఎదగాలని రాజకీయ హక్కుల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలకు పెద్దపీట వేయాలని మాదిగల సంక్షేమం కోసం ఇంకా అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దొడ్డే శంకర్ మాదిగ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న మాదిగల బ్రతుకుల్లో ఆశించినంత ఫలితాలు కనిపించడం లేదన్నారు. స్వాతంత్రానికి ముందు స్వాతంత్రం తర్వాత దళితుల



జనాభాలో అత్యధిక సంఖ్య గల మాదిగలకు సామాజిక రాజకీయ ఆర్థికపరమైన హక్కులకు ఇంకా దూరంలోనే ఉన్నారని అంటరానితనం అసమానతల పేరిట దళితులు ఈ శాస్త్ర సాంకేతిక రంగాల్లో కూడా వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎస్సీ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు మరిన్ని పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## యువకులకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ చేయూత

### యాదవ సోదరులకు అడిగిన వెంటనే 70 టీ-షర్ట్స్ అందించిన సమ్మి గౌడ్ చిలువేరు



**కేసముద్రం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పరపల్లి గ్రామంలోని శ్రీ బీరప్ప స్వామి దేవస్థానంలో బీరప్ప కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా ఉప్పరపల్లి బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ కలిసి సంఘ సభ్యులకు 70 టీ-షర్ట్స్ అందించాలని కోరగా, వెంటనే సానుకూలంగా స్పందించి 70 టీ-షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ "గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, సమాజ సేవే తన లక్ష్యమని" అన్నారు. కార్యక్రమంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ టీం సభ్యులు మరియు గ్రామ పలుస పద్మ వెంకన్న (8వ వార్డు), తండా సంపత్ (9వ వార్డు), పలుస రాకేష్, ఎసల్ల సత్యనారాయణ, కొమ్మనబోయిన రంజిత్, సీలోజు విజేందర్ అలాగే బీరప్ప కురుమ సంఘం సభ్యులు యారా ముత్తయ్య, కంచ కట్టయ్య, కంకల శ్రీనివాస్, కంకల బీరయ్య, కంకల సుమన్, కంచ కుమారస్వామి, కంకల ఐలయ్య, కుండే రతన్, కుండే మహేందర్, అల్లి అశోక్, కంచ ఐలయ్య, కంకల కుమారస్వామి, కంకల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు..






**మట్టెవాడ, జూలై 25 (పీపుల్స్ డైరీ):** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం వరంగల్ మహా నగరంలోని వైష్ణవాలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. వరంగల్ బట్టల బజారులోని బాలానగర శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు ఉదయం 4 గంటల నుంచే క్యూ లైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్నం వరకు కిలోమీటర్ పొడవునా క్యూ లైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకొని తరించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం ఆలయంలో మహిళలు భగవత్ గీత పారాయణం నిర్వహించారు. ఆలయ ఈవో వై.రత్నాకర్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### భక్తులకు లడ్డూల పంపిణీ..:

శ్రీ శ్రీనివాస పద్మావతీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏకాదశి సందర్భంగా బాలానగర శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం బయట ఉచిత లడ్డూ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ ప్రారంభించారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏకాదశి రోజున గీతా భవన్‌లో, సెకండ్ బ్యాంకు కాలనీ బాలాజీ టెంపుల్‌లో, టీచర్స్ కాలనీ వెంకటేశ్వరాలయంలో, ఎల్లమ్మ బజారులోని కొత్తగుడి, రామానుజ కూటంలో, బట్టల బజార్ వెంకటేశ్వర ఆలయం బయట సుమారు 3,000 లడ్డూలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## నూతన బోరు మోటర్ ప్రారంభం



**గణపురం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని ఐబి రోడ్డు కాలనీలో గత కొన్ని రోజులుగా బోరు రిపేరుతో ప్రజలు నీటి ఇబ్బంది ఎదుర్కొంటుండగా శనివారం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ నూతన బోరు మోటర్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుగ్యాల దేవేందర్ రావు, మాజీ ఉప సర్పంచ్ పొతర్ల అశోక్ యాదవ్, గుర్రం తిరుపతి గౌడ్, బూర రాజగోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమయాన్ని వృథా చేయకండి..

## సర్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయండి..! ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**మొగుళ్లపల్లి, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** మండలంలో బిఎల్ఏ ల ముఖ్య సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. సమయాన్ని వృధా చేయకండి.. సర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయండని అన్నారు. ముగ్గులపల్లి లోని అమ్మ గార్డెన్ లో శనివారం జరిగిన బిఎల్ఏ ల ముఖ్య సమావేశానికి హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, బిఎల్ఏ లకు, సర్పంచులకు, నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బూత్ స్థాయిలో. పార్టీ సంస్థాగత నిర్మాణం, బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి బూతు పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా చేపట్టి మొగుళ్ళపల్లి మండలంలో 100 శాతం పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బిఎల్ఏలు కృషి చేయాలన్నారు. ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ జాబితా నుండి తప్పి పోకుండా ప్రత్యేక శ్రద్ద వహించాలని, బిఎల్ఏ లు తమకు కేటాయించిన బూత్ పరిధిలో బి ఎల్ ఓ లతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సర్పంచులు, పార్టీ నాయకులు బిఎల్ఏ లు కార్యకర్తలు. బిఎల్ఓలతో కలసి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, పిఏసిఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగారావు, చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, పులి తిరుపతిరెడ్డి, మొగుళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, చిట్యాల ఎ ఎం సి వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ, చాట్ల రవీందర్, తక్కల్లపల్లి రాజు, పోల్నేని లింగారావు,ఏలేటి శివారెడ్డి, క్యాతారాజు రమేష్, గుండారపు రఘుపతి, తిప్పారపు యుగేందర్, పర్వతాలు, ఎర్రబెల్లి కోటేశ్వరరావు, పెంతల మధుకర్ రెడ్డి, ఆకుతోట కుమారస్వామి, బొల్లపల్లి రాములు గౌడ్, నాయకులు కార్యకర్తలు బిఎల్ఏలు పాల్గొన్నారు.



## చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలి

**రేగొండ, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని చాకలి ఎస్సీ సాధన సమితి భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గోపరాజు సాంబలక్ష్మీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శాసనసభలో తీర్మానం ఆమోదించి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని ఆమె కోరారు. రేగొండ మండలంలోని రేపాక గ్రామంలో శనివారం నిర్వహించిన చాకలి ఎస్సీ సాధన సమితి మండల కమిటీ ఎన్నికల సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమితి నూతన రేగొండ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మొగుళ్ల అజయ్, యూత్ అధ్యక్షుడిగా మొగుళ్ల నరేష్, ఉపాధ్యక్షుడిగా మామిడాల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ తిరుపతి, కోశాధికారిగా బూర్గుల వెంకటేష్ ఎన్నికయ్యారు. అలాగే రేపాక గ్రామ అధ్యక్షులుగా మొగుళ్ల కుమార్, మొగుళ్ల రాజయ్యలను ఎంపిక చేశారు.నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు మొగుళ్ల అజయ్ మాట్లాడుతూ.. చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. చాకలి కులస్తుల హక్కుల సాధనలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల్ల కరుణాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదుల శేఖర్‌తో పాటు సమితి నాయకులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ సంఘం జిల్లా కోశాధికారిగా శిరీష



**గణపురం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విశ్వకర్మ సంఘం జిల్లా కోశాధికారిగా ముప్పిడోజు శిరీషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ నాయకులు శృంగారపు భాస్కరాచారి, జిల్లా అధ్యక్షుడు వేణువంక శ్రీనివాసాచారి శనివారం తెలిపారు. విశ్వకర్మ సంఘం అభివృద్ధికి శిరీష అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిరీష సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదారపు రమేష్ చారి, గౌరవ అధ్యక్షుడు దోమకొండ రవీంద్ర చారి, భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు మంచోజు కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**శాయంపేట, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో "ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్‌లో భాగంగా విద్యార్థుల చే 300 మొక్కలు నాటించి ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. సందర్భంగా ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక్కొక్క మొక్కను నాటితే కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. విద్యార్థులకు చెట్ల యొక్క ప్రాముఖ్యతను చిన్నప్పటి నుండే నేర్పించాలని ఈ సందర్భంగా కోరారు. వాయు కాలుష్యం పెరిగి విపరీతమైన జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది కావున మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమం చేపట్టిన ప్రిన్సిపల్ రేవతిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షణికావేశంలో యువకుడు దాడి : వృద్ధుడి మృతి

### మృతదేహాన్ని పూడ్చిపెట్టే యత్నం - గ్రామస్తుల అప్రమత్తతతో వెలుగులోకి ఘటన



**నర్సంపేట, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామంలో క్షణికావేశం లో ఓ వృద్ధుడు హత్యకు గురైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని ఇంటి స్థలంలోనే పూడ్చిపెట్టేందుకు నిందితుడు యత్నించగా గ్రామస్తుల అప్రమత్తతతో విషయం బయటపడింది. గ్రామస్తులు, ఎస్సై రావుల రణధీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముస్కుల సాంబారెడ్డి ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఆరోగ్య కారణాలతో బట్టల్లోనే మలవిసర్జన చేసుకున్నట్లు సమాచారం. దీంతో ఆయన తమ్ముడి కుమారుడు ముస్కుల రాజిరెడ్డి ఆగ్రహానికి గురై, "నీకు ఎవరు సేవలు చేయాలి" అంటూ వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. అనంతరం క్షణికావేశంలో కర్రతో దాడి చేయడంతో సాంబారెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

### గుంత తవ్వుతుండగా అనుమానం

శనివారం ఉదయం సాంబారెడ్డి మృతి చెందినట్లు గుర్తించిన రాజిరెడ్డి మృతదేహాన్ని తన ఇంటి స్థలంలోనే పూడ్చిపెట్టేందుకు ఇంటి సమీపంలో గుంత తవ్వుతుండగా అనుమానం వచ్చిన గ్రామస్తులు అడ్డుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్సై పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి చల్లా ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





**నర్సంపేట, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, హాస్టల్, వంటశాల, ఆస్పత్రి వార్డులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర సౌకర్యాలను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల, ఆస్పత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు బీఎస్సీ నర్సింగ్ కళాశాల, జీఎంసి , నర్సింగ్ కళాశాల నిర్మాణం పనులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెన్స్ కోసం వెయిటింగ్ షెడ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, విద్యా ప్రమాణాలు, హాస్టల్, భోజన వసతులు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, అత్యంత త్వరలో ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. తద్వారా రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ (ఇన్‌చార్జ్) డా. ఎస్.లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్ (ఇన్‌చార్జ్) డా. ఎం. దామోదారి బాయి, వైస్ ప్రిన్సిపా ల్ (అకాడెమిక్స్) డా. కె. శ్రీదేవి, బీఎస్సీ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, టీఎస్ఎంఐడీసీ సివిల్ ఇంజనీర్ నరేష్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) వేణు, వైద్యులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం జిల్లా సంయుక్త కార్యదర్శిగా విద్యాసాగర్





**శాయంపేట, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలానికి చెందిన బాసాని విద్యాసాగర్ ను జిల్లా సంయుక్త కార్యదర్శిగా, జిల్లా అధికార ప్రతినిధిగా రాయరాదుల మొగిలిని నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ నందగిరి రజనీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని కార్యక్రమాలు చేసినందుకు నన్ను గుర్తించి నాకు ఈ బాధ్యత అప్పగించినందుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరంరాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు గణేష్ , జిల్లా ఉపాధ్యక్షులు గిద్దెమారు సురేష్, పల్లెబోయిన సారయ్య, శాయంపేట మండల అధ్యక్షులు ఇమ్మడిశెట్టి రవీందర్ ,టౌన్ అధ్యక్షులు రంగు మహేందర్‌లు నాపై నమ్మకంతో నాకు ఈ బాధ్యత అప్పగించిన నేపథ్యంలో ముందుండి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని నడుస్తానని అన్నారు .నాకు ఈ బాధ్యత ఇచ్చిన రాష్ట్ర, జిల్లా, మండల ,గ్రామ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటిన మంత్రి సీతక్క

### అమెరికా పర్యటన విజయవంతం - అభినందించిన జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్



**ములుగు, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** ప్రవాస భారతీయ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు అమెరికా పర్యటనకు వెళ్లిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి –డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్వదేశానికి విజయవంతంగా తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు –పైడాకుల అశోక్ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అమెరికా వేదికపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను సీతక్క ప్రపంచానికి సమర్థవంతంగా పరిచయం చేశారని అశోక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ గౌరవాన్ని, ఖ్యాతిని మరింత పెంచినందుకు మంత్రి నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల సంక్షేమే ధ్యేయంగా పనిచేస్తున్న సీతక్క నాయకత్వంలో రాష్ట్రంతో పాటు ములుగు జిల్లా కూడా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని అశోక్ విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మంత్రి తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. అమెరికా పర్యటన అనంతరం స్వదేశానికి చేరుకున్న సీతక్కకు స్వాగతం పలుకుతూ ఆమె సంపూర్ణ ఆయురారోగ్యాలతో, మరిన్ని విజయాలు సాధించాలని, తెలంగాణ ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని అశోక్ ఆకాంక్షించారు.



## చిన్నారి చిన్నును ఆదుకోరూ..!

### ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

**చిట్యాల, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల కేంద్రం వెంకట్రావుపల్లి సి గ్రామానికి చెందిన మాసు అనిల్ కుమారుడు అగు 11 నెలల బాబు చిన్ను గత 15 రోజుల క్రితం స్నానం కోసం అని వేడి నీళ్ల బకెట్ పక్కన పెడితే దానిని కదిలించగా పూర్తి వేడినీళ్లు మీద పడి 60 శాతం వరకు కాలడం జరిగింది. గత 15 రోజుల నుండి హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో దాదాపుగా 5 లక్షల వరకు ఖర్చు పెట్టి వైద్యం అందిస్తున్నారు. చికిత్స సమయంలో రెండు రోజుల క్రితం ఒక్కసారిగా చిన్నుకు గుండెపోటు రావడంతో వైద్యులు వెంటిలేషన్ మీద వైద్యం అందిస్తున్నారు. 11 నెలల బాబు ఎన్ని రోజుల వరకు వెంటిలేషన్ మీద నుండి ఎప్పుడు వస్తాడో ఇపుడే చెప్పలేము అని రోజుకు 1లక్ష రూపాయల ఖర్చు వస్తది అని దాదాపుగా 10 లక్షలు అవుతాయని చాలా సీరియస్ కండిషన్‌లో బాబు ఉన్నాడని వైద్యులు తెలిపారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్నారు. దయార్ద్ర హృదయులు ఆపదలో ఆదుకొనే దాతలు స్పందించి చిన్ను ప్రాణాలను కాపాడాలని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. మానవతా వాదులు సహృదయులు దయచేసి ఈ నెంబర్‌కి ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా మీ వంతు తోచిన సహాయంచేసి పసిగుడ్డు ప్రాణంను కాపాడాలని కోరారు. ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ మాసు అనిల్ 7036015141, బ్యాంకు అకౌంట్ నెంబర్ 35180222018 ఐఆఫ్ఎస్సి కోడ్ SBIN0006639 కు సాయం అందించాలని కోరుతున్నారు.

## 29వ రోజు నల్లబ్యాడ్జీల నిరసన



**గణపురం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను రూ.255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేటీకరణకు అప్పగించే టెండర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కేటీపీపీలో టీజీపీఈ జేఏసీ పిలుపు మేరకు శనివారం 29వ రోజు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడంతో పాటు పనిభారం అసమానంగా పెరుగుతుందని, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం వల్ల భద్రతా ప్రమాణాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు, బూడిద విభాగాల ప్రైవేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజారంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇది ఒక్క ప్లాంట్‌కే పరిమితమైన సమస్య కాదని, భవిష్యత్తులో విద్యుత్ రంగంలోని మరిన్ని విభాగాలను అవుట్‌సోర్సింగ్ లేదా ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరిచే ప్రయత్నాలకు నాంది కావొచ్చని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని యూనియన్ల ఇంజనీర్స్ అసోసియేషన్‌ల ప్రతినిధులు, ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై సీఎంకి పోస్ట్‌కార్డుల వినతి



**ఏన్కూర్, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** కేజీబీవీ,యుఆర్ ఎస్,సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి కేజీబీవీ, టిఆర్ఎస్,సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమాన్ని మండల కేంద్రంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్, మూడ్.పుల్లయ్య లు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్,సమగ్ర శిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులు దశాబ్దాలుగా శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగస్తులకు ఇస్తున్న హెల్త్ కార్డ్స్ ను వారికి కూడా జారీ చేయాలని, మిగతా ఉపాధ్యాయులకు వర్తింపజేసే అన్ని రకాల సెలవులు ఇవ్వాలని కోరారు. గతంలో చేసిన సమ్మె కాలానికి చెందిన 29 రోజుల వేతనం తక్షణమే చెల్లించాలన్నారు.కేర్ టేకర్లను నియమించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా ప్రభుత్వంలో కదలిక రావాలని కోరారు.లేని పక్షంలో రాబోయే కాలంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాఘవరావు,శ్రీదేవి, శంకర్రావు, నరసింహారావు, దివ్య,కేజీబీవీ ఇంచార్జ్ శ్రవంతి, విజేత,మంగతాయి, నీలావతి,శైలజ, రాధిక,అపర్ణ,సరిత, కవిత, స్వరూప, జ్యోతి, తులసి, మంగమ్మ, ప్రసాద్, శివాజీ,సుమన్, లత,హరిత, తదితరులు పాల్గొన్నారు.

## నాచారం ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



**ఏన్కూరు, జులై 25 (పీపుల్స్ డైరీ) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 43 కోట్ల ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి, ఫోర్-లైన్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నా యని ఆయన పేర్కొన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా శనివారం ఏన్కూర్ మండలంలోని నాచారంలోని శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరుగాంచిన నాచారం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అన్నారు. పూజల అనంతరం ఆలయ మేనేజర్ ఎస్.వి.డి. ప్రసాద్ ఎమ్మెల్యే దంపతులకు పట్టువస్త్రాలు బహుకరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ దర్శనం అనంతరం 'కమ్మ మహాజన సంఘం' ప్రతినిధులు బుగ్గినేని వెంకటేశ్వరరావు, మాదినేని అశోక్ కుమార్ తదితరులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ను ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, సత్యనారాయణాచార్యులు, నాయకులు స్వర్ణ నరేంద్ర, మేడా ధర్మారావు, పంతగాని నరేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి తంబళ్ల సామేలు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, ముక్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఏన్కూర్ లో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు జరిపారు. కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి

### నా పట్టు-నా అభిమానం కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన "నా పట్టు-- నా అభిమానం 2.0" జిల్లా స్థాయి భాగస్వామ్యుల సంప్రదింపుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు మరియు తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పట్టుపరిశ్రమ రైతులతో ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, ఖర్చు, నీటి వినియోగం, రాబడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టుపరిశ్రమ ఉందని, ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి, రైతులకు పట్టుపరిశ్రమ పై అవగాహన కల్పించి, జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. కేంద్ర పట్టు బోర్డు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలని సూచించారు. తెలంగాణలో పట్టుపరిశ్రమ అభివృద్ధిలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పట్టుపరిశ్రమకు నీటి వినియోగం చాలా తక్కువని, రిస్క్ కూడా తక్కువని, రాబడి ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. సబ్సిడీ పెంపు విషయమై ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ సమర్పిస్తామని, ప్రస్తుతానికి సబ్సిడీ తో పాటు లబ్ధిదారులు కొంత భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు, ఇతర భాగస్వామ్యులు, తదితరులున్నారు.

## ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల సాకారం చేసుకోవాలి : కలెక్టర్



**ఖమ్మం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** ఈర్లపూడి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల కు ప్రభుత్వ అర్థిక సహాయాన్ని వినియోగించుకొని త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. శనివారం ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈర్లపూడి గ్రామంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా సందర్శించి, పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేసేలా అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఈర్లపూడి గ్రామంలో మొదటి విడుతలో 160 ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 98 ఇండ్లు పూర్తి అయిన్నాయని, 62 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణాలు ఉన్నాయని, ఎక్కవ వరకు గోడల నిర్మాణం పూర్తయి, స్లాబ్ దశలో, నిర్మాణం ఉన్నాయని, లబ్దిదారులకు నిర్మాణంలో ఏలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పూర్తయిన దశల ప్రకారం ప్రతి సోమవారం బిల్లులను ప్రభుత్వం నేరుగా బ్యాంక్ ఖాతాకు జమచేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం పేదల గృహ కలను సాకారం చేయడంలో అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, ఎంపీడీవో అశోక్, ఈర్లపూడి సర్పంచ్ గీతా-దేవ్ సింగ్, హౌసింగ్ ఏఈలు, అధికారులు, తదితరులున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### రఘునాథపాలెం మండలం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్ సేవలు, మెడికల్ వార్డులు, రోగుల నమోదుతో పాటు ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు.



క్యాజువాలిటీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మందులు, పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవలను సమర్థవంతంగా వినియోగించి రోగులకు అవసరమైన పరీక్షల ఫలితాలను వీలైనంత త్వరగా అందించాలని ఆదేశించారు. ప్రతి ప్రత్యేక వైద్య విభాగానికి సంబంధించిన సేవలు, వైద్యుల అందుబాటు రోజులు, పరీక్షల వివరాలు, చికిత్స విధానాలు, మందుల నిల్వల సమాచారం ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, ఎంపీడీవో అశోక్ సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలి

### ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి - ఎంపీ వద్దిరాజు

**ఖమ్మం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** విద్యార్థులకు బకాయిపడిన 11వేల కోట్ల రూపాయల ఫీజులను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు,యువత ఆగ్రహావేశాలకు గురి కాకముందే వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన 11వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం శనివారం కొత్తగూడెం కమ్మ సంఘం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది.బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు,ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ను నిరసిస్తూ విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనకు దిగడంతో బెంబేలెత్తిన ప్రధాని నరేంద్రమోడీ మధ్య రాత్రి కూడా స్పందించారని, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని, విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, కార్మికులు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించని కారణంగా కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ బకాయిలు కూడా పెరిగిపోతున్నాయని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ యువత పోరుబాట పట్టారన్నారు. గోదావరి నీళ్లను సద్వినియోగంలోకి తేకుండా వృధాగా సముద్రం పాలవుతుంటే రేవంత్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, నాయకులు దళ్ సింగ్ నాయక్, లక్కినేని సురేందర్, రంగనాథ్, తొగరు రాజశేఖర్, మల్హోత్రా సాగర్, లావుడ్య సత్యనారాయణ, రాజు గౌడ్, అనుదీప్, నవతన్, వగ్గెల పూజ, జగడం కిరణ్, రమాకాంత్, కన్నిలతో పాటు పలు విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులున్నారు.



## సౌర వనరులు అపరిమితం..వాటిని సద్వినియోగం చేసుకుందాం

### రెడ్కో వైస్ చైర్మన్‌డఎండీ ముషారఫ్ ఫరూఖి



**ఖమ్మం, జూలై 25 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 81 మోడల్ సోలార్ విలేజ్‌ల కార్యక్రమంలో భాగంగా, ఖమ్మం జిల్లా బోనకల్ మండలాన్ని ఆదర్శ మోడల్ సోలార్ మండలంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న పనులను రెడ్కో వైస్ చైర్మన్‌డమేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి ఐఏఎస్, టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్‌డమేనేజింగ్ డైరెక్టర్ కర్ణాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఐఏఎస్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోనకల్, రావినూతల, గార్లపాడు గ్రామాల్లో కొనసాగుతున్న సోలార్ పనులను వారు పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోనకల్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్కో వైస్ చైర్మన్‌డఎండీ ముషారఫ్ ఫరూఖి, ఐఏఎస్ మాట్లాడుతూ... తెలంగాణలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచి, మోడల్ సోలార్ గ్రామాలను దేశానికే ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. "సౌర వనరులు అపరిమితం. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని ఆయన అన్నారు. విద్యుత్ నిత్యావసరంగా మారిన నేపథ్యంలో రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తిలో ప్రధానంగా వినియోగిస్తున్న బొగ్గు వనరులు పరిమితమైనవని తెలిపారు. బొగ్గు వినియోగాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లపై, వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ వంతుగా సౌర విద్యుత్ ఉత్పత్తికి సహకరించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,000 కోట్ల వ్యయంతో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

### విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి 60 కోట్లు

టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ మాట్లాడుతూ... బోనకల్ మండలంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు ?60 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. మండలంలో మూడు కొత్త సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, రావినూతలలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని, వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ పంప్‌సెట్ల వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.

### ప్రతి ఇంటినీ సోలరైజ్ చేయాలి : కలెక్టర్

ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐఏఎస్ మాట్లాడుతూ... ప్రతి ఇంటినీ సోలరైజ్ చేయడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా స్థానికంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి మోడల్ సోలార్ గ్రామాల వల్ల కలిగే ప్రయోజనాలు, సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు, సోలార్ పంప్‌సెట్ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచడం, విద్యుత్ వ్యయాలను తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం వంటి లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్కో, టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు, సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ప్రాజెక్టు అధికారులు, జిల్లా అధికారులు, అమలు సంస్థల ప్రతినిధులు తదితరులున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com